గర్గుల్‌లో సెవెన్ ఎసైడ్ హాకీ టోర్నమెంట్

కామారెడ్డి టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి గర్గుల్ గ్రామంలో ఆదివారం జిల్లా స్థాయి సెవెన్ ఎసైడ్ హాకీ జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నోముల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో గర్గుల్ పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో కామారెడ్డి కేజీబీవీ పాఠశాల విద్యార్థులు, బాలుర విభాగంలో గర్గుల్ పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో బీబీపేట పాఠశాల విద్యార్థులు నిలిచారని తెలిపారు.



మండలి పోరులో.. గెలుపెవరిదో?



- నేడు కరీంనగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితాలు
- ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ
- పట్టభద్రుల పోరులో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యనే తీవ్ర పోటీ
- టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ, బీజేపీల మధ్య హోరాహోరీ
- ఇప్పటికే పోలింగ్ సరళిపై అంచనాలు వేస్తున్న అభ్యర్థులు
- గెలుపుపై ఆయా అభ్యర్థుల్లో ఎవరికి వారే ధీమా
- జిల్లాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పోలైన ఓట్లు 14,703

కామారెడ్డి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసన మండలి పోరులో ఎవరు గెలిచేది సోమవారం తేలనుంది. రెండు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంటుంది. గతంతో పోలిస్తే ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఆ స్థాయిలోనే ఈ రెండు ప్రధాన పార్టీలు అభ్యర్థుల తరఫున పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఆ స్థాయిలోనే ఓటర్లను కేంద్రాలకు రప్పించి ఓట్లు వేయించారు. దీంతో గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ఈ సారి పట్టభద్రులు, ఉపాధ్యాయ పోలింగ్ శాతం భారీగా పెరిగింది. భారీగా పెరిగిన పోలింగ్ శాతం ఎవరిని గెలుపు తీరాలకు తీసుకెళ్తుంది. ఎవరి కొంప ముంచుతుందనేది మరికొన్ని గంటలు ఆగాల్సిందే.

భారీగా పోలైన ఓట్లు

గత 2019 ఎమ్మెల్సీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ శాతం పెరగడంతో పాటు భారీగా ఓట్లు నమోదయ్యాయి. ఇటీవల జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో మొత్తం 54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్‌లలో ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు మొత్తం 14,703 ఓట్లు పోల్ అయ్యాయి. పట్టభద్రుల స్థానానికి జిల్లా వ్యాప్తంగా 16,410 ఓట్లు ఉండగా ఇందులో పురుషుల ఓట్లు 11,616, మహిళల ఓట్లు 4,793, ఇతరుల ఓట్లు 1 ఉన్నాయి. ఇందులోంచి మొత్తం 12,820 ఓట్లు పోల్ అయ్యాయి. పురుషుల ఓట్లు 9,127, మహిళల ఓట్లు 3,693 ఓట్లు పోల్ అయ్యాయి. అదే విధంగా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి జిల్లా వ్యాప్తంగా 2011 ఓట్లు ఉండగా ఇందులో పురుషుల ఓట్లు 1307, మహిళల ఓట్లు 704 ఉన్నాయి. ఇందులోంచి మొత్తం 1,883 ఓట్లు పోల్ అయ్యాయి. పురుషుల ఓట్లు 1216, మహిళల ఓట్లు 667 ఓట్లు పోల్ అయ్యాయి. కామారెడ్డి డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 9,350 మంది ఉండగా 7,160 మంది ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో పురుషుల ఓట్లు 4,826, మహిళల ఓట్లు 2,334 ఉన్నాయి. టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 1,331 ఉండగా 1,242 మంది ఓటు హక్కును వినియోగించుకోగా అందులో 763 మంది పురుషులు, 479 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 2,655 మంది ఉండగా 2,211 మంది ఓట్లు వినియోగించుకోగా పురుషులు 1,699 మంది, మహిళలు 512 మంది, టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 163 ఉండగా 151 మంది ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో 99 మంది పురుషులు, 52 మంది మహిళలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 4,405 మంది ఉండగా ఇందులో 3,449 మంది ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో పురుషులు 2,602, మహిళలు 847 ఓట్లు హక్కును వినియోగించుకున్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 517 ఉండగా 490 మంది ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో 354 మంది పురుషులు, 136 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రచారం

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎన్నికల ప్రచారం హోరాహోరీగా అభ్యర్థులే కాకుండా ప్రధాన పార్టీలు నిర్వహించాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పట్టభద్రుల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం చేపట్టాయి. కాంగ్రెస్ పార్టీ వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జీని నియమించగా బీజేపీ 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జీని నియమించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు ప్రచారం చేపట్టారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు మద్దతుగా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, డీకే అరుణ, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రచారం చేపట్టారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ఆ స్థాయిలోనే ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు భారీగానే తాయిలాలు ఖర్చుపెట్టినట్లు ప్రచారం సాగింది.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

జిల్లా పరిధిలో పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై పార్టీల నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపుపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పట్టభద్రుల స్థానం కోసం పోటీ నెలకొంది. టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో పీఆర్‌టీయూ, బీజేపీ అభ్యర్థుల మధ్యనే పోటీ సాగింది. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పోటీ చేయకపోవడంతో ఆ ఓట్లు ఎవరికి పడ్డాయనే దానిపైనే చర్చ సాగుతోంది. పట్టభద్రులు కాంగ్రెస్, బీజేపీ వైపే ఎక్కువగా మొగ్గు చూపారు. వీరిద్దరిలో ఎవరు గెలుస్తారనేది ఇటీవల జరిగిన పోలింగ్ సరళిలో పార్టీలు లెక్కలు వేసుకు న్నాయి. అయితే పట్టభద్రుల్లో బీఆర్‌ఎస్ ఓట్లు పడ్డాయనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో బీఎస్‌పీ నుంచి పోటీలో ఉన్న ప్రసన్న హరికృష్ణకు సైతం భారీగానే పోలవడంతో ఎవరు గెలుస్తారనే దానిపైనే ఉత్కంఠ నెలకొంటుంది. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి పీఆర్‌టీయూ, బీజేపీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. ఓటర్లు ఈ ఇద్దరు అభ్యర్థులకు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయ, ఎమ్మెల్సీ గెలుపుపై కూడా ఈ ఇద్దరు అభ్యర్థులు ధీమాగా ఉన్నారు.

ఫలితాలపై ఉత్కంఠ

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరగనుంది. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు ఎవరు ఓడుతారు అనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ ఎన్నికల్లో పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి అనుకూలిస్తోంది ఎవరిని గెలుపు తీరాలకు తీసుకెళ్తుంది ఎవరు ఓడిపోతారు అనేదానిపై పట్టభద్రుల్లో, ఉపాధ్యాయుల్లో చర్చ సాగుతోంది. మరోవైపు ప్రధాన పార్టీలు సైతం ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం ఆ స్థాయిలో ప్రచారం నిర్వహించడంతో తమ పార్టీ అభ్యర్థి గెలుస్తారా లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంటుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారా ఓడుతారా ఈ సారి గట్టిపోటీ ఇచ్చిన బీజేపీ మండలిలో పాగా వేస్తుందా లేదా అనే దానిపై రాజకీయ వర్గాల్లోనూ చర్చసాగుతోంది. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు బీఎస్‌పీ అభ్యర్థి గట్టిపోటీ నిచ్చారు. ఈ అభ్యర్థి ఎవరి ఓట్లు చీల్చారనేది నేడు తేలనుంది.




క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

క్రికెట్ అకాడమి ప్రారంభం

కామారెడ్డి టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని గ్రీన్‌సిటీలో ప్రకాష్‌చంద్ క్రికెట్ అకాడమీని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు యువకులు క్రీడలపైన దృష్టి సారించాలన్నారు. శారీరకంగా దృఢంగా తయారవడంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందని తెలిపారు. యువకులకు అందుబాటులో క్రికెట్ అకాడమీని ప్రారంభించడం సంతోషకరమని అందుకు కృషి చేసిన విపుల్‌జైన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్	సహర్
సా.6.28	ఉ.5.10



ఎవరైతే అల్లాహ్‌కు విధేయతను పాటించడంలో తన మనోకాంక్షలతో పోరాడుతాడో.. అతడే నిజమైన ముజాహిద్ (యోధుడు)



ఆధునికీకరణ దిశగా అడుగులు

- డంపింగ్ యార్డులో చెత్తను తొలగించే దిశలో నగరపాలక సంస్థ
- బయో మైనింగ్ యంత్రాలతో శుద్ధి
- వేరు చేసిన చెత్తను ఎరువుగా అమ్మకాలు
- ఇప్పటికే 22 వేల మెట్రిక్ టన్నుల చెత్త తీసివేత

7



మారథాన్ రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, క్రీడాకారులు

కామారెడ్డిలో మారథాన్ రన్

కామారెడ్డి టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : పద్మపాణి సొసైటీ ఫర్ హ్యూమన్స్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో చైల్డ్‌హుడ్ క్యాన్సర్ అవేర్‌నెస్ మారథాన్ రన్‌ను ఆదివారం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు కామారెడ్డిలోని పాఠశాల విద్యార్థులు 2 వేల మంది వరకు రన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏఎస్పీ చైతన్యరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్ గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని, ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి మెరుగైన చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుతుందని లేదంటే తీవ్రత పెరిగితే మరణాలు కూడా సంభవిస్తాయని తెలిపారు. ఇలాంటి మారథాన్ చిన్నచిన్న పట్టణాల్లో కూడా నిర్వహించడం వల్ల తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుని, ప్రతి ఒక్కరూ తమ జీవితకాలాన్ని పెంచుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. 3 కి.మీ, 5 కి.మీలు, 10 కి.మీలు, 21 కి.మీ పరుగు పందెలాను నిర్వహించారు. నాలుగు విభాగాల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అండర్ 45 మహిళ విభాగంలో 21 కి.మీలో ఉమా, స్వప్న, ఉషారాణి, కావ్య, శ్రీదివ్యలు మొదటి 5 స్థానాల్లో నిలిచారు. అండర్ 45 పురుషుల విభాగంలో 21 కి.మీ.లో లింగన్న, రజినీకాంత్, రామయ్య, అనిల్‌కుమార్, దేవరాజులు మొదటి 5 స్థానాల్లో నిలిచారు. 45 ఏళ్లపైబడిన వారిలో జిల్లా నుంచి గెరిగంటి లక్ష్మీనారాయణ రూ.5వేల క్యాష్ ప్రైజ్ గెలుపొందగా క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతున్న వారి కోసం తిరిగి ఎన్‌జీవో సంస్థకు అందించారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు, రెండో స్థానంలో నిలిచినవారికి రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలను ఏఎస్పీ చైతన్యరెడ్డి, ప్రముఖ సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పద్మపాని సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ స్వర్ణలత, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా పాఠశాలల విద్యార్థులు, పట్టణ యువకులు, తదితరులు పాల్గొన్నారు.



మొదటి స్థానంలో నిలిచిన విజేతకు రూ. 15వేల చెక్కును అందిస్తున్న ఏఎస్పీ

బెల్లం వంటకాల.. ఘుమఘుమలు!



భిక్కనూరులో బెల్లం వండుతున్న దృశ్యం

- బెల్లం, చెరుకు పాలకు పెరిగిన డిమాండ్
- బెల్లం తయారీకి భిక్కనూరు, సదాశివనగర్‌లో పలువురు రైతుల ఆసక్తి
- చెరుకు పాలు లీటరు చొప్పున, బెల్లం కిలో చొప్పున విక్రయాలు
- కొనుగోలుకు క్యూ కడుతున్న ప్రజలు
- ప్రభుత్వం ఆంక్షలు తొలగిస్తే మరికొందరు రైతులు ముందుకొచ్చే అవకాశం

భిక్కనూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో బెల్లం గుమగుమలు మళ్లీ మొదలయ్యాయి. కామారెడ్డి జిల్లాలో 2002 కంటే ముందు వరి పంట కంటే చెరుకు సాగు చేసే రైతులే ఎక్కువగా ఉండేవారు. దీంతో జిల్లాలోని ఏ గ్రామానికి వెళ్లినా గ్రామాలన్నీ బెల్లం వాసనతో గుమగుమలాడేవి. ఏ ఇల్లు చూసినా, గోదాం చూసినా బెల్లం ముద్దల రాసులు ఉండేవి. బెల్లం అంటే కామారెడ్డి, కామారెడ్డి అంటే బెల్లం అన్న విధంగా విరాజిల్లగా రానురాను చాలా రకాల కారణాలతో బెల్లం తయారీపై ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో రైతులు చెరుకు పంటను సాగు చేయడం పూర్తిగా తగ్గించి వరి పంటపై దృష్టి సారించారు. దీంతో గ్రామాల్లో బెల్లం తయారీ చేయడం చూద్దామన్నా కనిపించని పరిస్థితి నెలకొంది. కానీ గత సంవత్సరాల కాలంగా భిక్కనూరు, సదాశివనగర్ మండలాల్లో అక్కడక్కడ మరల బెల్లం తయారీ మొదలైంది. రైతులు చెరుకు పంటను సాగు చేసి ఫ్యాక్టరీకి తీసుకెళ్తే ఎలాంటి లాభం రాకపోగా నష్టం చూడాల్సి వస్తుందని పాత పద్ధతిలాగానే వ్యవసాయబావుల వద్ద ఎలాంటి కెమికల్స్ కలుపకుండా సాంప్రదాయ పద్ధతిలో బెల్లం తయారీ చేసి మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు తగ్గట్టు లీటరు చెరుకు పాలు రూ.50, కిలో బెల్లం రూ.100కు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్న ఎక్సైజ్ పోలీసుల నుంచి మాత్రం వీరికి కొంత ఇబ్బందులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బెల్లంపై ఆంక్షలు తొలగించి బెల్లానికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గ్రామాల్లో రైతులు వేడుకుంటున్న పరిస్థితి ఉంది.

బెల్లం, చెరుకు పాలకు పెరిగిన డిమాండ్

వంటల్లో వాడటానికి కానీ, ఆయుర్వేదిక్ మందుల్లో వాడటానికి గానీ బెల్లం తప్పనిసరి కావడంతో పాటుగా రైతులు, హమాలీలు వారి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ కొద్దిగా బెల్లం తీసుకోవడం పరిపాటి. ఇదే అదునుగా కిరాణ దుకాణాల్లో కల్తీ బెల్లం దొంగచాటుగా విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో కొందరు చెలగాటం ఆడుతున్నారు. రోడ్లపై తోపుడు బండ్లను పెట్టి చెరుకు పాలను విక్రయిస్తున్నా అందులో సగం ఐస్ కానీ నీరే ఉంటుందని ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయబావుల బెల్లం తయారీకి కొందరు రైతులు ముందుకు రావడంతో చెరుకు పాలు, బెల్లంకు చాలా డిమాండ్ పెరిగింది. దీంతో తయారీదారులు లీటరు చెరుకు పాలు రూ.50, కిలీ బెల్లం రూ.100కు విక్రయిస్తున్నారు. ప్రజలు సైతం స్వచ్ఛమైన చెరుకు పాలు, బెల్లం లభిస్తుండటంతో కొనుగోలుకు ప్రజలు సైతం ఆసక్తి చూపుతున్నారు. కామారెడ్డి జిల్లాతో పాటుగా కరీంనగర్, హైదరాబాద్, మెదక్, సిద్దిపేటకు చెందిన వారు ఎక్కువగా ఈ బెల్లం కోసం వస్తున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో ఆయా శాఖల్లో ఉద్యోగాలు చేస్తు న్న వారు ఆయా జిల్లాలోని వారి సొంత గ్రామాలకు తీసుకెళ్తుండటంతో ఈ బెల్లం, చెరుకు పాలకు ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. ఫోన్‌లలో సైతం బెల్లం ఆర్డర్లు వస్తుండటం గమనార్హం.



విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న బెల్లం ముద్దలు

ప్రభుత్వం ఆంక్షలు తొలగిస్తే మరికొందరు రైతులు ముందుకొచ్చే అవకాశం

ప్రస్తుతం జిల్లాలో చాలా తక్కువ విస్తీర్ణంలో చెరుకు పంట సాగవుతోంది. 2002 సంవత్సరం నుంచి బెల్లం తయారీపై ప్రభుత్వాలు ఆంక్షలు తీసుకురాగా గత ఎన్నికల ముందు బెల్లం తయారీపై ఆంక్షలు ఎత్తివేసి చెరుకు పంటకు పాత రోజులు తీసుకువస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బెల్లం తయారీపై ఆంక్షలు తొలగిస్తే జిల్లాలో చెరుకు పంట సాగుకు ఎక్కువ మొత్తంలో రైతులు ముందుకు వచ్చే అవకాశంతో పాటుగా గ్రామాల్లో బెల్లం గుమగుమలు మరల వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

రెండేళ్లుగా బెల్లం వండుతున్నాం

• రామాగౌడ్, రైతు భిక్కనూరు



చెరుకు పంటను గత చాలా సంవత్సరాలుగా సాగు చేస్తున్నా. సాగు ఏసిన చెరుకును గత రెండు సంవత్సరాల క్రితం వరకు ఫ్యాక్టరీకి తరలించా. చెరుకును ఫ్యాక్టరీకి తరలిస్తే లాభం రాకపోగా నష్టం వస్తోంది. దీంతో తానే స్వయంగా గత రెండు సంవత్సరాలుగా నా వ్యవసాయ బావి వద్ద బెల్లం వండుతున్నా. ఈ తయారీలో ఎలాంటి కెమికల్స్ కలుపకుండా సాంప్రదాయ పద్ధతిలో వండి కిలో చొప్పున స్థానికంగానే విక్రయిస్తున్నా. బెల్లంతో పాటుగా లీటరు చొప్పున చెరుకు పాలను విక్రయిస్తున్నా. ప్రస్తుతం గిరాకీ బాగానే ఉంది.

ప్రభుత్వం చెరుకు రైతులను ప్రోత్సహించాలి

• కేతి రాములు, రైతు రామేశ్వర్‌పల్లి



ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చెరుకు రైతులను ప్రోత్సహించి మద్దతు ధర కల్పించాలి. గతంలో చెరుకుపై ఆంక్షలు ఉండటంతో ఈ చెరుకు పంటను సాగు చేయడానికి రైతులు ఎక్కువగా ముందుకు రాలేదు. తాను ఈ సంవత్సరం నుంచి బెల్లాన్ని తానే వండి కిలో రూ.100 చొప్పున విక్రయిస్తున్నా. గతంలో చెరుకును గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీకి తరలించేవాడిని.



చెరుకు పాలు పడుతున్న దృశ్యం

సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

కామారెడ్డి - ఎల్లారెడ్డి

90322 16482

అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్: 99854 11454

బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

బస్టాండు లేకపోవడం సిగ్గుచేటు

● కోటగిరిలో సీపీఐ నాయకులు విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కోటగిరి,మార్చి 2(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు లేకపోవడం సిగ్గుచేటని సీపీఐ నాయకులు విట్టల్ గౌడ్ విమర్శించారు. మం డల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం సీపీఐ నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పాత బస్టాండు శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు రోడ్లపై నిలబడి బస్సులు ఎక్కాల్సి వస్తుందన్నారు. మహిళలు బస్సులు వచ్చేవరకు షాపుల ముందు నిలబడాల్సి వస్తోందని పేర్కొన్నారు. వందలాది మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం బోధన్, నిజామాబాద్ పట్టణాలకు వెళ్ళి వస్తుంటారన్నారు. చుట్టూ పక్కల గ్రామాల నుంచి మండల కేంద్రానికి పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులు నిత్యం వస్తుంటారన్నారు. బస్టాండు సౌకర్యం లేక విద్యార్థినిలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. వేసవి కాలంలో ప్రయాణికులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. బస్టాండు నిర్మాణానికి నిధులు మంజూరైన ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడం సిగ్గు చేటన్నారు. ప్రస్తుతం ఉన్న బస్టాండు స్థలంలో బస్టాండు నిర్మిస్తే ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అంగడి బజార్లో ఖాళీ స్థలం ఉన్నందున బస్టాండు నిర్మాణం అక్కడ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గంగాధర్, రాములు, వీరేశం, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం



బడాభీమ్‌గల్‌లో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీమ్‌గల్‌రూరల్, మార్చి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో శ్రీ శివసాయి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఈ వైద్యశిబిరాన్ని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సాయికుమార్ ప్రారంభించారు. ఈ శిబిరాన్ని వంద మంది చిన్నపిల్లలకు సుమారు 400మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమ్‌గల్‌లో ఆసుపత్రి ప్రారంభించి ఐదేళ్ళు అవుతుందని, ఇప్పటి వరకు 23ఉచిత క్యాంపులు నిర్వహించామన్నారు. తమ గ్రామంలో వైద్యశబిరాన్ని ఏర్పాటు చేసినందుకు సాయికుమార్‌ను గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయిబాబా, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు సూర్యనారాయణ, జైపాల్, ప్రదీప్, అనిల్, గ్రామాభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు దండు మహేష్, బుర్ర శ్రీనివాస్, పల్లె మహిపాల్, కిషన్, నెల్ల శ్రీనివాస్, రగులా లింబాద్రి, మూత లింబాద్రి, స్వామి,బోజన్న, రగుల మోహన్, ఆసుపత్రి సిబ్బంది అవంతిక, రమ్య, నందిని, లావణ్య, సాబుద్దిన్, అలం కృష్ణ, ముకేష్, ప్రకాష్, సాయి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి

● ఒకరికి తీవ్రగాయాలు



దాడిలో గాయపడ్డ నాగరాజు

ఆర్మూర్‌టౌన్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామంలో పదునైన ఆయుధాలతో పలువురు దాడిచేయగా ఒకరికి తీవ్రగాయాలై జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు మండలం లోని దేగాం గ్రామానికి చెందిన గంగారాజు దగ్గర బంధువులతో రెండేళ్ళ క్రితం తగదాలు ఏర్పడ్డాయి. ఇరువర్గాల గొడవ కులపంచాయతీకి రాగా గంగారాజు కుటుంబాన్ని కులబహిష్కరణ చేశారు. ఈ విషయమై పలుమార్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గంగాధర్ కుటుంబంపై దగ్గరి బంధువులు పగ పట్టారు. ఇదీలా ఉండగా ఆదివారం గంగారాజు కుమారుడు నాగరాజు పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా లక్ష్మీనర్సింహ ఆలయం వద్ద దగ్గర బంధువులతో వాగ్వాదం చోటు చేసుకుంది. వీరందరు కలిసి నాగరాజును పదునైనా ఆయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న తండ్రి గంగారాజు ఆర్మూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించే సమయంలో నాగరాజుపై మళ్ళీ దాడి చేయడానికి ప్రయత్నించారు. దీంతో ఆసుపత్రిలో ఘర్షణ వాతా వరణం నెలకొనడంతో ఆసుపత్రి సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఆసు పత్రికి వచ్చి పలువురిని సముదాయించారు. తీవ్రంగా గాయపడిన నాగరాజును చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.


రాజరాజేశ్వరస్వామి విగ్రహాల ఊరేగింపు



పల్లకిని గుట్టపై నుంచి గ్రామానికి తీసుకువెళ్తున్న భక్తులు

వేల్పూర్, మార్చి2(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె గ్రామస్థుల ఆరాధ్య దైవమైన శ్రీ రాజరాజేశ్వరస్వామిని గుట్ట ఆలయం నుంచి ఆదివారం సాయంత్రం పల్లకిపై డప్పువాయిద్యాల మధ్య గ్రామ ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం రాజరాజేశ్వరస్వామిని పల్లకిపై ఉంచి గ్రామ ప్రధానవీధులగుండా డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా జాతర జరిగే గుట్ట ఆలయానికి తీసుకువెళ్ళారు. అక్కడ భక్తుల నైవేద్యాలు సమర్పించారు. దర్శనమిచ్చిన రాజరాజేశ్వరుని జాతర, రథోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి గుట్ట ఆలయంలో నిద్రపోయిన రాజరాజేశ్వరస్వామిని పల్లకిపై వైద్యాల మధ్య భక్తులు శివనామస్మరణాలతో గ్రామ ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భక్తులు బారులు తీరి స్వామివారికి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.

పోలీసు శాఖలో మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి



మాజీ స్పీకర్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు డీసీపీ బస్వారెడ్డి

ఖిల్లా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని పోలీసు శాఖ కార్యాలయంలో ఆదివారం వేడుకలను నిర్వహించారు. ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూశర్మ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ జి.బస్వారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ శ్రీపాదరావు ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులను పట్టించుకునే వారని అన్నారు. ఈ సంద ర్భంగా 1999లో మహదేవ్‌పూర్ మండలం అన్నారంకు తన అనుచర వర్గంతో వెళ్లి వస్తున్న సమయంలో మార్గమధ్యంలోనే అడవుల్లో ఆయన వాహనాన్ని నక్సలైట్లు ఆయనతో మాట్లాడాలని చెప్పి అడవిలోకి తీసుకెళ్లి దారుణంగా హతమార్చారని అన్నారు. ఈ సంఘటన అప్పట్లో రాష్ట్రాన్ని కుదిపేసిందని గుర్తు చేశారు. ఏఅపకారం తలపెట్టని నాయకుడిని నిష్కారనంగా హత మార్చిన మావోయిస్టులపై విమర్శలు వెల్లువెత్తాయని తెలిపారు. దీంతో రాజకీయ అనిశ్చిత పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల కోసం తుపాకులు పట్టినట్లు చెప్పుకునే మావోయిస్టులు ఇలాంటి దుశ్చర్యాలకు పాల్పడడాన్ని ప్రతీ ఒక్కరు విమర్శించారని అన్నారు. ఆయన ఇప్పటికి ప్రజల హృదయాల్లో చిరస్థాయిలో నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఏఆర్ రాంచందర్‌రావు, సిబ్బంది శంకర్, ఆర్ఐ వెల్ఫేర్ శ్రీనివాస్, ఆర్‌బీ సీఐ సతీష్, ఆర్ఎస్ఐ నిశిత్, ఐటీకోర్, పోలీస్ కంట్రోల్ రూమ్, సెంట్రల్ కంప్లేయింట్, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖిలా:మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాధరావు జయంతిని పురస్కరించుకొని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఆదివారం ఆయన చిత్రపటానికి ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సాయాగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సాయన్న, కార్యాలయ సిబ్బంది మహేష్, భాస్కర్, తదితరులు ఉన్నారు.

నిజామాబాద్ అర్బన్:శాసనసభ మాజీ స్పీకర్ దూదిళ్ల శ్రీపాధరావు జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ అంకిత్ విచ్చేసి శ్రీపాధరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభ స్పీకర్‌గా శ్రీపాధరావు అందించిన సేవలను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ముత్తెన్న, ఎన్ఐసీ అధికారి మధు, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్:మాజీ స్పీకర్ శ్రీపాధరావుకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఘన నివాళులు అర్పించింది. ఆదివారం ఆయన జయంతిని పురస్కరించుకొని గ్రంథాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం మాట్లాడుతూ శ్రీపాధరావు విలువలతో కూడిన రాజకీయ నాయకుడిగా ఎదిగారని ప్రజల కోసమే తన జీవితాన్ని ధారపోశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ అభిలాష్, భాగ్యలక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



నివాళులర్పిస్తున్న దృశ్యం

సాలూర ఎత్తిపోతల వద్ద

ఉద్యోగులపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

బోధన్‌రూరల్,మార్చి2(ఆంధ్రజ్యోతి): సాలూర ఎత్తిపోతల పంప్ హౌస్ వద్ద శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ట్రాన్స్‌ఫార్మర్స్ కాయిల్స్ చోరీ చేయడానికి వచ్చిన దొంగలు అక్కడే ఉన్న ఆపరేటర్, వాచ్‌మెన్‌లను అడ్డగించారు. దీంతో దొంగలు వారిని తాళ్లతో కట్టివేసి అక్కడి నుండి పరారీ అయ్యారు. ఆపరేటర్ లక్ష్మణ్, వాచ్‌మెన్ నర్సయ్యలను తాళ్లతో నిర్బంధించి ట్రాన్స్‌ఫార్మర్స్ కాయిల్స్ చోరీ చేయడానికి యత్నించారు. ఎత్తిపోతల పంప్‌హౌస్, ట్రాన్స్‌ఫార్మర్లకు తాళాలు ఉండడంతో వారు పరారీ అయ్యారు. గుర్తు తెలియని దొంగలను పట్టుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

● రైతుల ఆందోళన

ప్రస్తుతం వరిపంట పొట్టదశలో ఉందని అసలు ఎండకాలం ఎండలు ముదుతుండడంతో పంటకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలకు నీరు సరిపోవడం లేదని ఇలాంటి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు పోతే వరిపొలాలు ఎండిపోతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎత్తిపోతల పథకాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు పాడైనా, చోరీ అయినా కొత్త వాటిని తీసుకోవడానికి రైతులు అనేక అవస్థలు ఎదుర్కొవాల్సి వస్తుందని రైతులు పేర్కొన్నారు. అన్నదాతలను ఆదుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. పోలీసులు దొంగలపై నిఘా పెట్టాలని, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. పరారీ అయిన దొంగలు మరాఠీలో మాట్లాడడంతో మహరాష్ట్ర వారు ఉండవచ్చని ఆపరేటర్, వాచ్‌మెన్‌లు భావిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు అన్ని కోణాల్లో విచారించి ట్రాన్స్‌ఫార్మర్ దొంగలను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి మాట్లాడుతూ సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారించి దొంగలను త్వరలోనే పట్టుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆందోళన విరమించారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన

డొంకేశ్వర్ మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ప్రతిష్ఠాపన వేడుకలకు ఆలయం ముస్తాబైంది. ఇక్కడి ఆలయంలో గల దేవతమూర్తుల విగ్రహం పునప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాన్ని మూడురోజుల పాటు అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, గ్రామ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 4 నుంచి 6 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. 4న జలాధివాసం, 5న భగవత్ ఆరాధన, విగ్రహ పంచామృత అభిషేకం, ధ్యానవాసము, దేవత మంత్ర ఆవనము, పుష్ప, ఫల శతాదివాసము, 6న దేవతమూర్తుల మంత్రి హవనము, యంత్ర ప్రతిష్ఠా విగ్రహప్రతిష్ఠ ధ్వజస్తంభ ప్రతిష్ఠ, జయ విజయ ప్రతిష్ఠ, గరుడ శిఖర ప్రతిష్ఠ, లక్ష్మీనర్సింహస్వామి ప్రాణప్రతిష్ఠ, కన్య దానము, శాంతి కల్యాణం మహదశీర్వవనము చేపట్టనున్నారు. ఎంతో ప్రాశస్త్యం గల ఇక్కడి ఆలయాన్ని ఇటీవల సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ ప్రతిష్ఠాపనకు హంపీ విరూపక్ష విదారణ్య భారతిస్వామి, బాలయోగి రాములు, మహరాజ్ సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు.



ముస్తాబైన ఆలయం

విహారయాత్రకు వెళ్లిన మోకన్‌పల్లి కేజీబీవీ విద్యార్థులు

నవీపేట,మార్చి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంసీ)ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా విద్యార్థులు హైదరాబాద్‌లోని సాలర్‌జంగ్ మ్యూజియం, బిర్లా మందిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



హైదరాబాద్‌లో కేజీబీవీ విద్యార్థులు

ఇరిగేషన్ స్థలం కబ్జాలో మాజీ సర్పంచ్ హస్తం

● బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్

ముప్కాల్, మార్చి2(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోని ప్రధానమైన లక్ష్మీ కాలువ కబ్జాలో ముప్కాల్ మాజీ సర్పంచ్ హస్తం ఉందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ ఆరోపించారు. , అక్రమంగా నిర్మించిన షట్టర్లను ఖాళీ చేయాలని ఆ శాఖ అధికారులు ఆదేశించినా, కోర్టు స్టే ఆర్డర్ పేరుతో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఆదివారం ముప్కాల్ మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 70/1, 70/2, 70/3 సర్వేలోని 400 గజాలస్థలాన్ని కబ్జా చేసి షట్టర్లు నిర్మించి అద్దెకిచ్చారని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వ్యాపార సముదాయాలను కూల్చకుండా స్టే పేరుతో అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు సర్వేనెంబర్‌లతో కోర్టును సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇటీవల నిర్మించిన ఫంక్షన్‌హాల్‌కు పర్మిషన్ ఇవ్వలేదని, సరైన రోడ్డు మార్గం కూడా లేదన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అధికార పార్టీ ముఖ్యనేతను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, పాలకులు అక్రమాలకు వత్తాసు పలుకకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



మురికికాలువలు శుభ్రం చేస్తున్న కార్మికులు

భీమ్‌గల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు 2వ వార్డులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా మురికికాలువలను శుభ్రం చేసి కాలువల్లో నుంచి తీసిన చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యారుకు తరలించారు. మార్చి 1నుంచి పట్టణంలోని అన్ని వార్డులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ఈనెల 18వరకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ గోపు గంగాధర్ అన్నారు. తడిపొడి చెత్త వేరు చేయడం, ఇంట్లో పోగా చేసిన చెత్తను మున్సిపల్ వాహనంలో వేయడం అలవాటు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌చార్జీ ఇన్‌స్పెక్టర్ సున్నపు ఓంకార్, వార్డు అధికారి కొత్వల నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పల్లికొండ శ్రీధర్, జవాన్ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

మోచి సంఘం నూతన కార్యవర్గం

ఆర్మూర్‌టౌన్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మోచి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మోచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ్లపు ముత్యం తెలిపారు. మోచిలను ఎస్సీ బీ కేటగిరిలో చేర్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 12శాతం రిజర్వేషన్‌లు శాతం పెంచాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షునిగా ఓటర్‌కర్ గంగాధర్, ప్రధానకార్యదర్శిగా కొండ్లెపు సుధాకర్, కోశాధికారిగా సాయిలు, సంయుక్త కార్యదర్శి ప్రవీన్‌లను ఎన్నుకున్నారు.

బోధన్‌లో వ్యక్తి అదృశ్యం

బోధన్‌రూరల్,మార్చి2(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతానికి జోరీగల శేఖర్ అనే వ్యక్తి శనివారం అదృశ్యమయ్యాడని అతని భార్య జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసిందని బోధన్ టౌన్ సీఐ వెంకట నారాయణ తెలిపారు. శేఖర్ ఫైనాన్స్ డబ్బులు వసూలు చేయడానికి మెట్‌పల్లి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడని, కొంతసేపటి తర్వాత శేఖర్ భార్య జ్యోతి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఆఫీస్‌కి వెళ్లి పరిశీలించగా అక్కడ తన భర్త మోటార్ సైకిల్, సెల్‌ఫోన్, ఇతర వస్తువులు అన్ని ఆఫీస్‌లోనే ఉన్నాయని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె భర్త గురించి చుట్టు పక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

మందర్నాలో యువకుడి ఆత్మహత్య

బోధన్‌రూరల్,మార్చి2(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలోని మందర్నా గ్రామానికి చెందిన కే.రాజేందర్ అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు తండ్రి మల్లుగౌండ ఫిర్యాదులో పేర్కొన్నట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మృతుడి తండ్రి మల్లుగౌండ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మోతెలో కలుషితమైన నీటి సరఫరా

వేల్పూర్, మార్చి2(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సరఫరా అవుతున్న తాగునీరు కలుషీతమై రావడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు గ్రామానికి సంబంధించిన వాటర్‌ట్యాంకులు నింపి పైపుల ద్వారా ఇంటింటికి సరఫరా చేస్తున్నారు. కాగా గత కొన్ని రోజుల నుంచి సరఫరా అవుతున్న తాగునీరు గోధుమ రంగుతో కూడిన కలుషీతమైన తాగునీరు వస్తుందని గ్రామ స్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీ కావ డం వల్ల మురుగుతో కూడిన రంగు నీరు పైప్‌లైన్‌లోకి వెళ్లి నీరు కలుషీత మవుతుందని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ అధికారులు తాగునీరు కలుషీతం కాకుండా పైప్‌లైన్ లీకేజీలను మరమ్మ తులు చేసి సురక్షితమైన తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వేల్పూర్, మార్చి2(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న పోతులూరీ వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కళ్యాణం, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. విశ్వకర్మ బ్రహ్మణ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతి ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి కళ్యాణం నిర్వహించగా భక్తులు తిలకించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. రాత్రి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు గంగాధర్, సంఘ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, మార్చి2(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2002-03 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసు కున్న విద్యార్థులు అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనం దోత్సహాల మధ్య గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మా నించి మెమెంటోలు అందజేశారు. విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో కలిసి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి రావడంతో పాఠశాలలో పండగ వాతావ రణం నెలకొంది. భవిష్యత్‌లో మరిన్ని సమావేశాలు నిర్వహించి పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించాలని నిర్ణయించుకున్నారు. ఈకార్యక్రమంలో కల్లెం సాయిరెడ్డి, అనిల్, రాజు, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

అర్హులైన కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

● పద్మ, ఏపీఎం, ఉమ్మడి మద్నూర్



ఉమ్మడి మద్నూర్ మండలంలో అర్హులైన కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఉమ్మడి మద్నూర్ మండల ఏపీఎం పద్మ అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి మండలంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి. ఎంత మంది పని చేస్తున్నారు. 2024-25 సంవత్సరానికి ఎంత ఖర్చు చేశారు?

ఏపీఎం: ఉమ్మడి మద్నూర్ మండలంలో 15,210 జాబ్ కార్డులు ఉండగా, వాటిలో 8,684 మంది ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. 2024-25 సంవత్సరంలో రూ.202.41 లక్షల పనులు జరిగాయి. వాటిలో మెటీరియల్ వాటా కింద రూ.36.12 వాడుకున్నాం. మిగతా ఉపాధి కూలీకి చెల్లించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: ఉపాధి కూలీలకు వేసవి భత్యం రావడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి?

ఏపీఎం: వేసవిలో పని చేస్తున్న కూలీలకు ఫిబ్రవరి నెలలో 20 శాతం, మార్చి మాసంలో 25 శాతం, ఏప్రిల్, మే మాసాల్లో 30 శాతం, జూన్‌లో 20 శాతం అలవెన్స్‌గా చెల్లిస్తుండేవారు. ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గతంలో వినియోగించిన సాఫ్ట్ వేర్ కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. రెండు సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసీ సాఫ్ట్ వేర్ ప్రవేశపెట్టింది. దీంతో రెండు సంవత్సరాలుగా ఉపాధి హామీ కూలీ చెల్లింపు నేరుగా కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారా చెల్లిస్తుంది. కూలీ రూ.300 పెంచడం వల్ల అందులోనే కలిపి వేసవి భత్యం అందజేస్తుంది.

ఆంధ్రజ్యోతి: ఈజీఎస్ పూర్తి సమాచారం తెలుసుకోవడానికి కొత్తగా ఎటువంటి యాప్ ఏర్పాటు చేశారు?

ఏపీఎం: కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ నిధులు, పనుల సమాచారం తెలుసుకోవడానికి అందుబాటులోకి జన్‌మన్ నరేగా అనే యాప్ సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: జన్‌మన్ నరేగా యాప్‌తో ఎవరికి లాభం?

ఏపీఎం: జన్‌మన్ నరేగా యాప్ ద్వారా ఉపాధి కూలీలు తాము పనులు చేసిన వివరాలను ఎంత మొత్తంలో డబ్బులు వచ్చాయో తెలుసుకోవచ్చు. పని చేసిన దానికి సంబంధించిన డబ్బులు వచ్చాయా లేదా ఈ యాప్ ద్వారా తెలుస్తుంది.

ఆంధ్రజ్యోతి: కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారా?

ఏపీఎం : ఈ ఏడాది ప్రతి గ్రామ పంచాయితీ కార్యాలయాలతో పాటు మండల కేంద్రంలోని ప్రతి కార్యాలయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసే విధంగా లక్ష్యం పెట్టుకున్నాను.

ఆంధ్రజ్యోతి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఎంత మందిని ఎంపిక చేశారు?

ఏపీఎం: రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేసిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద జిల్లా అధికారులు పంపిన జాబితా ప్రకారం 727 మందిని ఎంపిక చేశారు.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఎంపిక కావడానికి ఉపాధి కూలీగా ఉండాలని ప్రభుత్వం నిబంధనలు పెట్టడంతో కొత్తగా జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారా?

ఏపీఎం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఉపాధి హామీ పథకం పనులకు అనుసంధానం చేయడంతో కొత్త జాబ్ కార్డుల కోసం చాలా మంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. ముందుగా ఆయా గ్రామ పంచాయితీలో దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తున్నాం. గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆధారంగా జాబ్ కార్డులను అందజేస్తాం.

● (ఆంధ్రజ్యోతి, మద్నూర్)



బయో మైనింగ్ చేస్తున్న యంత్రాలు



పేరుకుపోయిన చెత్త డంప్



చెత్తను టిప్పర్‌లో నింపుతున్న దృశ్యం

ఆధునికీకరణ దిశగా అడుగులు

● డంపింగ్ యార్డులో చెత్తను తొలగించే దిశలో నగర పాలక సంస్థ ● బయో మైనింగ్ యంత్రాలతో శుద్ధి

● వేరు చేసిన చెత్తను ఎరువుగా అమ్మకాలు ● ఇప్పటికే 22 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తీసివేత

సుభాష్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు ఆధునికీకరణ దిశగా అడుగులు వేస్తుంది. డంపింగ్ యార్డులో ఆధునీకరణ యంత్రాలతో చెత్తను శుద్ధి చేసేలా బయోమైనింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. తడి, పొడి చెత్తను బయో మైనింగ్ ద్వారా వేరుచేసి శుద్ధి చేస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో డంపింగ్‌యార్డును నాగారం అటవీ ప్రాంతంలో సుమారు 51ఎకరాల్లో ఏర్పాటు చేశారు. 60 డివిజన్ల నుంచి రోజువారీగా సుమారు 250నుంచి 280 మెట్రిక్ టన్నుల వరకు చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు చేరవేస్తున్నారు. కార్పొరేషన్‌కు చెందిన 112 వాహనాల్లో ప్రతిరోజు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు చేరవేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా చెత్త పేరుకుపోయింది. సుమారు 4లక్షల 50వేల మెట్రిక్ టన్నుల చెత్తను ఇప్పటి వరకు నగరపాలక సంస్థ సేకరించింది. ఇప్పటి వరకు సేకరించిన తడిచెత్త, పొడి చెత్తతో డంపింగ్‌యార్డు మొత్తం గుట్టలుగుట్టలుగా పేరుకుపోయింది. వీటి నుంచి దుర్వాసన సైతం వస్తుండడంతో నగర పాలక సంస్థ అధికారులు డంపింగ్‌యార్డులోని చెత్తను తొలగించేందుకు బయోమైనింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. తొలుత డీజిల్ ద్వారా బయోమైనింగ్ యంత్రాలను నడిపించిన అనంతరం 27 సెప్టెంబర్ 2024 నుంచి కరెంట్ ద్వారా యంత్రాలను నడిపించి తడి, పొడి చెత్తను వేరుచేసి శుద్ధి చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 23వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధీకరించారు.

బయోమైనింగ్ యంత్రాల పనితీరు

తడి, పొడి చెత్తను వేరు చేయడానికి ప్రత్యేక యంత్రాలతో శుద్ధి చేస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యంత్రాలు ప్లాస్టిక్, మట్టి, రాళ్లు, ఇతర వ్యర్థాలను వేరుచేసి గుట్టలుగా చేయనున్నారు. మొదటగా లెగసీవెస్ట్ అంతటిని విండ్‌రోజ్‌గా సమకూర్చి వాటిపై బయోకల్చర్ ఇనాక్యులమ్ కెమికల్స్‌ను చల్లనున్నారు. చెత్తలో వేడిని ఉత్పత్తిచేసి వాసన పోయేలా చేస్తున్నారు. దీంతో కంపోస్ట్ ఎరువు తయారీకి ఉపయోగపడేలా చేస్తున్నారు. ఇలా స్ప్రేచేసి ఆరబెట్టిన చెత్తను కంపోస్టు గాను, రాళ్లుగా విభజించనున్నారు. కంపోస్ట్, రాళ్లను సైతం వివిధ పనుల్లో ఉపయోగించనున్నారు. ఆర్‌డీఎఫ్ ప్లాస్టిక్ మెటీరియల్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలించనున్నారు. వాటిని ఇటీవలే ఓ సిమెంట్ ఫ్యాక్టరీతో ఎప్పటికప్పుడు తీసుకుపోయేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుతం రెండు యంత్రాలతోనే బయోమైనింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా మరో రెండు యంత్రాలతో పనులు చేసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో మరో రెండు యంత్రాలు కూడా నిజామాబాద్ నగరపాలక సంస్థకు రానున్నట్లు సమాచారం. మరో రెండు యంత్రాలు వస్తే చెత్తను మరింత తొందరగా శుద్ధి చేయవచ్చు.

ఎరువుల తయారీ అమ్మకం

బయోమైనింగ్ యంత్రాల ద్వారా వేరుచేసిన చెత్తను ఎరువుగా మార్చి నగరపాలక సంస్థ ఆదాయాన్ని సమకూర్చుకుంటుంది. నగర పాలక సంస్థ అధికారులు సేంద్రీయ ఎరువుగా మార్చి చిన్నపాటి సంచుల్లో నింపి కిలోల చొప్పున అమ్మనున్నారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సంచుల్లో అమ్ముతున్నారు. దీనిద్వారా నగరపాలక సంస్థ కొంతమొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుకుంటుంది. ఈ ఎరువును పూల మొక్కలు, తదితర మొక్కల పెంపకంలో వాడుతున్నారు. 5 కేజీలకు 100 రూపాయల చొప్పున నగరపాలకసంస్థ అధికారులు విక్రయిస్తున్నారు.

ప్రైవేట్ భాగస్వామ్యంతో బయో మైనింగ్

నగరపాలక సంస్థ తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు ప్రైవేట్ భాగస్వామ్యంతో బయోమైనింగ్ యంత్రాలు తీసుకువచ్చి చెత్తను ఏరి వేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తను శుద్ధి చేసి డంపింగ్ యార్డును పరిశుభ్రంగా, పచ్చదనంగా తీర్చిదిద్దేందుకు ఎంఎస్ క్యూబ్ బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రాజెక్టును అప్పగించారు. వీరి ఆధ్వర్యంలోనే బయోమైనింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. రోజూవారీగా ఎంత చెత్తను శుద్ధిచేయాలనే నిబంధనతో రోజూవారీగా బయోమైనింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా లోకల్‌గా ఉన్న యువతకు సైతం ఉపాధి దొరుకుతుంది. దీంతో సుమారు పదుల సంఖ్యలో యువకులు రోజువారి కూలీ పనులు చేస్తున్నారు.

ఎరువుగా మార్చి అమ్ముతున్నాం

● ప్రభుదాస్, డంపింగ్ యార్డు ఇన్‌చార్జి



డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్తను యంత్రాలతో వేరుచేసి శుద్ధిచేసిన వాటిని ఎరువుగా మారుస్తున్నాం. ఎరువును చిన్నపాటి సంచుల్లో నింపి విక్రయిస్తున్నాం. 5 కేజీల బస్తాకు వంద రూపాయల చొప్పున విక్రయించడంతో సంస్థకు కొంత మేర ఆదాయం వస్తుంది. ప్రస్తుతం ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు నడుస్తున్నాయి. త్వరలో రాత్రి వేళల్లో కూడా పనులు కొనసాగేలా చూస్తాం.

జాతీయ హాకీ క్రీడా పోటీలకు తూంపల్లి విద్యార్థి ఎంపిక



మాలవత్ మమత

సిరికొండ మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ సీనియర్ హాకీ క్రీడల పోటీలకు సిరికొండ మండలం తూంపల్లి హైస్కూల్ విద్యార్థి మాలవత్ మమత ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నగేష్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని జింఖాన గ్రౌండ్‌లో ఫిబ్రవరి 16న జరిగిన జాతీయ సెలెక్షన్ పోటీలలో తూం పల్లి హై స్కూల్‌కు చెందిన మాలవత్ మమత క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించినందున జాతీయ క్రీడల పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని నగేష్ తెలిపారు. జాతీయ హాకీ క్రీడల పోటీలు హర్యాన రాష్ట్రంలో ఈ నెల 2 నుంచి 10 వరకు జరుగుతున్న క్రీడల పోటీలలో మమత పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. మమత ఎంపిక కావడం పట్ల జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి తూంపల్లి గ్రామ పెద్దలు అభినందించారు. మమత మరెన్నో జాతీయ క్రీడల్లో పల్గొని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.



మిట్టపల్లిలో శివ లింగాల కోసం చెరువులో వెతుకుతున్న గొల్లకుర్మలు

మిట్టపల్లిలో ఘనంగా బీరప్ప ఉత్సవాలు

● నేడు బీరప్ప కామరతి కల్యాణం

● హాజరుకానున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లిలో 12 సంవత్సరాల తర్వాత అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామానికి చెందిన గొల్లకుర్మలు గత అర్ధరాత్రి గ్రామ పెద్ద చెరువులో దాచిన శివలింగాలను శివసత్తులు కేరింతలు వేస్తూ నీటిలో గాలించారు. 3గంటల తర్వాత లభించిన లింగాలతో బీరప్ప ఆలయం చేరుకొని ప్రతీ యేటా గొల్ల కుర్మలకు పాడి పశుసంపద లబ్ధి చేకూర్చాలని పూజలు నిర్వహించారు. శివశక్తి పూనకాలతో గ్రామంలో పండుగ వాతవరణం నెలకొంది. నేడు ఆలయ ప్రాంగణంలో బీరప్ప కామరతిల కల్యాణోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకలకు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి హాజరవుతున్నారని గ్రామ కుర్మ గొల్ల సంఘం ప్రతినిధి పెద్ద మల్లయ్య కుర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణం సందర్భంగా గ్రామంలో బోనాల ఊరేగింపు నిర్వహన ఉంటుందని తెలిపారు.



శివ సత్తులు వేస్తున్న పూజారులు



ఉత్సవాల్లో లింగాలను ఊరేగిస్తున్న గొల్లకుర్మలు

మురుగు కుంపటిగా టీటీడీసీ

● పన్నులు వసూళ్లు సరే మురుగు కాల్వల నిర్మాణం ఏదీ? ● పలు కాలనీలలో రోడ్లపై పారుతున్న మురుగు

● కాల్వల నిర్మాణం లేక రోడ్డుపై పారుతున్న మురుగు ● పట్టించుకోని ఘన్‌పూర్ పంచాయతీ అధికారులు

డిచ్‌పల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఘన్‌పూర్ గ్రామ పరిధిలోని టీటీడీసీ చట్టుపక్కల కాలనీలపై గ్రామ పంచాయతీ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేక స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పన్నులు ముక్కు పిండి వసూళ్లు చేస్తున్న అధికారులు కనీసం కాలనీలో మురుగు కాల్వలు నిర్మాణం చేయడం లేదని రోడ్డుపై అడ్డంగా మురుగు ప్రవహిస్తుందని దీంతో వాహనదారులకు కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. కాలనీ రోజురోజుకు విస్తరిస్తుంది. చుట్టూ పక్కల నుంచి చాలా గ్రామాల వాళ్లు ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు దీంతో నూతన భవనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఘన్‌పూర్ గ్రామానికి శివారులో దూరంగా ఉండటం, ఇక్కడే స్థానికేతరులు అధికంగా ఉండటంతో గ్రామ పంచాయతీ అధికారులు చిన్న చూపు చూస్తూ అభివృద్ధిని విస్మరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిరుద్యోగులకు ఉచిత శిక్షణలు ఇచ్చే ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి కార్యాలయం, మరియు టీటీడీసీ కార్యాలయాలు ఉన్న, ఇక్కడికి తరుచూ ఉన్నతాధికారులు వస్తుంటారు. అయిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. నూతన భవంతులతో సిటీలాగా ఉన్న కాలనీలో మౌలిక సదు పాయాలు లేక దుర్గంధం వెదజల్లుతుంది. సీసీ రోడ్లు లేక వర్షకాలంలో రో డ్లన్నీ బురదమయంగా మారి ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు దూరం దూరం ఉండటంతో తరుచు విద్యుత్ సమస్యలు అదే విధం గా కనీసం తాగునీటి సాదుపాయం గ్రామ పంచాయతీ అధికారులు కల్పిం చలేదు. ఇక్కడ కుళాయి ఏర్పాటు దేవుడెరుగు కనీసం మంచినీళ్ల అందిం చడానికి ఒక్క బోరు కూడా కనబడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా, మండల ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీల్లో మౌలిక సదు పాయాలు కల్పించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.



టీటీడీసీ ఎదుట రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



మురుగు కాల్వలు లేక రోడ్డుపై పారుతున్న మురికి నీరు



ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ కార్యాలయం ఎదుట మురుగు నీరు



పశువులకు చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు



సంచార వాహనంతో పశువైద్య సిబ్బంది

మూగజీవాలకు అందుబాటులో 1962 సేవలు

● జీవాల రక్షణకు చర్యలు ● వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్న రైతులు

దోమకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మనుషులకు అనారోగ్యం వస్తే అత్యవసర సమయంలో 108 వాహనం అందుబాటులోకి వచ్చి ఆపదలో ఉన్నవారిని రక్షిస్తుంది. అదే కోవలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాలకు అందుబాటులో ఉండేలా 1962 సంచార పశు సంవర్ధక శాఖ వాహనంతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు, పశువులకు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వెంటనే 1962కి కాల్ చేయడంతో 30 నిమిషాల వ్యవధిలోపే వైద్యులు సాయి కుమార్, పరవీర్ పావని, హెల్పర్ మహ్మద్, డ్రైవర్ అహ్మద్‌లు అక్కడికి చేరుకుని పశువులకు చికిత్స అందిస్తున్నారు. డివిజన్ పరిధిలోని ఆయా మండలాల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వెంట వెంటనే పరిష్కరిస్తూ మూగజీవాలను కాపాడుతున్నారు. వైద్య సిబ్బంది తెల్లవారు జాము వరకు గ్రామాలకు చేరుకుంటున్నారు. మండల కేంద్రాల్లో గల పశువుల ఆసుపత్రికి పశువులను తీసుకెళ్లాలంటే రైతులకు చాలా ఇబ్బందులు కలిగేవి. కాల్ చేయగానే పశువులకు అందుబాటులో ఉంటూ చికిత్స అందిస్తూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు. రైతుల మన్ననలు పొందడంతో పాటు వైద్య సిబ్బందికి దోమకొండ, బీబీపేట మండలాల పశువుల రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

చికిత్స అందిస్తున్నాం

● సాయి కుమార్, పశువైద్యాధికారి

కామారెడ్డి డివిజన్ పరిధిలో నుంచి రైతులు 1962 పశు సంవర్ధక శాఖకి కాల్ చేసి సమస్యను తెలుపగానే తక్కువ సమయంలోనే సిబ్బందితో వెళ్లి చికిత్స అందిస్తున్నాం. చికిత్స అనంతరం పశువుకు అవసరమైన మందులను అందజేస్తున్నాం.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ PEDDA RAMESH S/o. ASHANNA R/o. H.No. 1-120, Marampalle(V), Nandipet(M), Nzb(D), have changed my name as KANOOR RAMESH

AJK-16576

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్
ప్రతి 4 లైన్లకు 190/- అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453

బడిలో మోగని వాటర్ బెల్ !


పాఠశాల విద్యార్థులు (ఫైల్)

- విద్యార్థులకు తగినంత నీరు అందని వైనం
- డీహైడ్రేషన్ భారిన విద్యార్థులు
- నీరుతాగక ఇబ్బందులు
- 2018లోనే ప్రతి గంటకొకసారి నీటి గంట పెట్టాలనే నిబంధన
- ప్రస్తుతం ఏ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అమలుచేయని వైనం

కామారెడ్డిటౌన్,మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి నుంచి మొదలుకొని పదోతరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మార్కులే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మరోవైపు విద్యార్థుల ఆరోగ్యం కోసం ఉన్న నిబంధనలు అమలు కావడం లేదు. ప్రభుత్వం కొన్ని మార్పులు తీసుకువస్తుంటే ప్రైవేట్ విద్యాసంస్థలు మరికొన్ని జోడించడంతో విద్యావ్యవస్థలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల శారీరకంగా ఇబ్బందులకు గురవుతూ అనారోగ్యానికి భారిన పడుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. కేవలం పుస్తకంతో కుస్తీ చేయిస్తున్నారే తప్ప కనీసం విద్యార్థుల శరీరానికి అందాల్సిన నీటిపై ఎవరు పట్టించుకోవడం లేదు. దీంతో సరిపడ నీరు తాగకపోవడంతో తలనొప్పి, కడుపునొప్పితో బాధపడడంతో పాటు విద్యార్థులు నీరసంగా ఉంటున్నారు. ఇలాంటి ప్రాథమిక లక్షణాలను గుర్తించిన గత ప్రభుత్వం పాఠశాలల్లో ప్రతి గంటకోసారి వాటర్‌బెల్ మోగించాలని నిర్ణయించింది. కాని కోవిడ్ తర్వాత దీని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. విద్యార్థులు అనారోగ్యం భారిన పడకుండా ఉండాలంటే ముఖ్యంగా వారికి నీరు బాగా తాగించాలని వైద్యులు చెబుతున్నారు. నీరు సరైన మోతాదులో లేకపోతే విద్యార్థులు అనారోగ్యానికి గురై ఏకాగ్రత దెబ్బతిని చదువుపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చాలామంది నిపుణులు, వైద్యులు శరీరానికి సరిపడా నీరు తాగడం ప్రధానమని సూచిస్తున్నారు. ప్రతి పాఠశాలలో నీటి గంటను పెట్టాలని విద్యార్థి సంఘ నాయకులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

● పిల్లల శరీరానికి అందని నీరు

పాఠశాలలో వాటర్‌బెల్ కార్యక్రమాన్ని 2018లో విద్యాశాఖ ప్రారంభించింది. కోవిడ్ తర్వాత పాఠశాలలు పున: ప్రారంభమైనప్పటి నుంచి ఎవరూ దాని గురించి పట్టించుకోలేదు. విద్యార్థులు బడి సమయంలో సుమారు 1.5 లీటర్ల నీరు తీసుకుంటే మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. చిన్నపిల్లల వైద్యుల వద్దకు వస్తున్న వారిలో చాలామంది సరైన నీరు తాగకపోవడంతో వ్యాధుల భారిన పడి చికిత్సలు పొందుతున్నవారే ఎక్కువగా ఉండడం గమనార్హం. వయస్సును బట్టి 3 నుంచి 4 లీటర్లు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విద్యార్థులు ఉదయం ఇంటి నుంచి వాటర్‌బాటిల్ తీసుకెళ్తున్న లంచ్ సమయంలో తప్ప మరెప్పుడూ తాగడం లేదు. దీంతో వారి శరీరానికి కావాల్సిన నీరు అందక ఇబ్బందికి గురవుతున్నారు. గతంలో ఫస్ట్‌బెల్, సెకండ్‌బెల్, ఇంటర్వెల్ ఇలా ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం అది మర్చిపోయారు.

● ఎండకాలం మరింత తీవ్రం

ప్రస్తుతం ఎండకాలం నీరు ఎంతో అవసరం. ఒక వేళ నీరు లేకపోతే శరీరం ఎక్కువగా డీహైడ్రేషన్‌కు లోనవుతుంది. ఎండాకాలంలో శరీరంలో అన్ని అవయవాలు సమర్థవంతంగా పనిచేయాలంటే నీరు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. నీరు ఎక్కువగా తీసుకుంటే రక్తం పలచగా మరి రక్తప్రసరణ సక్రమంగా జరుగుతోంది. ఒక వేళ నీటిశాతం తగ్గితే మూత్రపిండాల్లో రాళ్లు, విద్యార్థుల్లో ముఖ్యంగా జ్వరం, మూత్రంలో ఇన్‌ఫెక్షన్, అసిడిటి, మల బద్ధకం, మూర్ఛ, కాలేయ,చర్మ వ్యాధుల వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రతి ఒక్కవిద్యార్థి స్కూల్‌కు వెళ్లె సమయంలో వాటర్ బాటిల్ తీసుకుని ప్రతి గంటకు ఒకసారి తాగాలని లేదా పాఠశాలల్లోనే విద్యార్థులకు అవసరమైన తాగు నీటిని ఏర్పాటు చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

● భయంతో నీటిని తాగని విద్యార్థులు

జిల్లాలోని చాలా పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం మెరుగానే ఉంది. అయితే గంటకోసారి నీరు తాగితే మూత్రం వస్తుందన్న కారణంతో, మూత్రం వస్తుందనంటే ఉపాధ్యాయులు బయటకు పంపిచరేమోనని చాలావరకు విద్యార్థులు నీటిని తాగేందుకు దూరంగా ఉంటున్నారని విద్యార్థి సంఘనాయకులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో టిఫిన్‌తో పాటు తీసుకుని వచ్చిన వాటర్ బాటిళ్లను బ్యాగ్‌లో కాకుండా దూరంగా పెట్టిస్తుండడంతో విద్యార్థులు నీరు తాగలేక పోతున్నారని ఆరోపిస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో మూత్రశాలలు లేకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారింది. ఈ క్రమంలో నీరు తగినంతగా తాగకపోవడంతో ఎక్కువగా విద్యార్థులు కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన ఎంతైనా ఉంది.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి


శివకుమార్ సూపరింటెండెంట్

నిజాంసాగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఇంటర్మీడియట్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ శివకుమార్ ఆదివారం తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. కళాశాల పరీక్షా కేంద్రం మండల కేంద్రంలోని జీహెచ్‌ఎస్ పాఠశాలను అధికార యంత్రాంగం ఖరారు చేసిందని ఆయన తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో కస్తూర్బా, ఆదర్శ పాఠశాల గురుకుల నిజాంసాగర్ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 8 గంటలకే కళాశాల ఆవరణలో ఉండాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రంలో తాగునీరు, వైద్యారోగ్య శాఖ అవసరమైన ఏర్పాట్లు చేసిందన్నారు.

నాయకులకు సన్మానం


సన్మానిస్తున్న ఆలయ కమిటీ

రామారెడ్డి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోసానిపేట్ గ్రామంలో గల శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించిన కాంగ్రెస్ మండల నాయకుడు నారెడ్డి శ్రీనివాస్ రెడ్డిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. శాలువా కప్పి మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ నారెడ్డి మహిపాల్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, పెంటయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌హౌస్ నిర్మాణాన్ని సక్రమంగా నిర్వహించాలి

● హౌసింగ్ శాఖ డీఈ సుభాష్


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

రామారెడ్డి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ కార్యాలయ అధికారి భవన నిర్మాణాలను సక్ర మంగా నిర్వహించాలని కామారెడ్డి హౌసింగ్ శాఖ డివిజనల్ ఇంజనీర్ సుభాష్ పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఐదు లక్షల రూపాయల నిధులతో ఇందిరమ్మ మోడల్ హౌస్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ విషయమై హౌసింగ్ శాఖ డివిజన్ ఇంజనీర్ సుభాష్ పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. సక్రమంగా విధులు నిర్వహించి పనులు చేపట్టాలని పలు సలహాలు, సూచనలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి, హౌసింగ్ ఏఈ అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఏఎస్పీ


మాచారెడ్డి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మారథాన్‌రన్‌లో పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు మెడల్స్ వచ్చినట్లు పాఠశాల పీడీ మహ్మద్ అతిఖుల్లా తెలిపారు. పవిత్ర, మౌనిక ,పల్లవి, చరణ్, పరమేష్, దినేష్‌లు 5 కే రన్‌లో, వైష్ణవి, వర్థిని, రష్మిత, ప్రశాంతి, అభిలాష్‌గౌడ్, దినేష్, ఈశ్వర్, అన్వేష్, దేవిదాస్, రామ్‌చరన్‌లు 3కే రన్‌లో ఉత్తమ ప్రతిభకనభరిచారని వారికి ఏఎస్పీ చైతన్యరెడ్డి మెడల్స్ అందించారని తెలిపారు.

బాధితులకు పరామర్శ


మాజీ ఎంపీటీసీని పరామర్శిస్తున్న దృశ్యం

రామారెడ్డి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపేట్ గ్రామ మాజీ ఎంపీటీసీ రాజాగౌడ్‌ను ఆదివారం కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ పరామర్శించారు. వారం రోజుల క్రితం దెబ్బతగలడంతో విషయం తెలుసుకుని రెడ్డిపేట్ గ్రామానికి వచ్చి పరామర్శించారు. కార్యక్రమంలో రామారెడ్డి మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, నాయకులు నల్లవెల్లి అశోక్, బీఆర్‌ఎస్ పార్టీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి నాయక్, మద్దికుంట గ్రామ మాజీ ఎంపీటీసీ రాజేందర్, బీఆర్‌ఎస్ కామారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, టౌన్ యూత్ ప్రెసిడెంట్ భాను, సొసైటీ వైస్ చైర్మన్ రమేష్, రామారెడ్డి ఎంపీటీసీ రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నసురుల్లాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబసభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీసభ్యులు సౌకర్యాలు కల్పించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

పిట్లం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోమటిచెరువు తండాకు చెందిన అనిల్ (22) పురుగుల మందు తాగి మృతిచెందినట్లు ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోమటి చెరువు తండాకు చెందిన అనిల్ వ్యవసాయం చేసుకుని జీవించేవాడు. మద్యానికి బానిసై గుర్తు తెలియని పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి తండ్రి తులసిరామ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టుదలతో చదివితే విజయాలు సాధించవచ్చు

బోధన్‌రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివితే విజయాలు సాధించవచ్చని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఇందూర్ మోడల్ హైస్కూల్‌లో వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో బీడీల మైసమ్మ జాతర


బోనాల వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే షిండే

నిజాంసాగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం గోరువెల్ గ్రామ శివారులో బీడీల మైసమ్మ జాతర ఆదివారం నిర్వహించారు. బీడీల మైసమ్మ తల్లికి భక్తులు ఓడి బియ్యం, అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి బోనాలను ఊరేగిస్తూ బీడీల మైసమ్మ వరం ఆలయం వద్దకు కొనసాగింది. వేడుకల్లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమాన్ షిండే పాల్గొన్నారు. గ్రామ ప్రముఖులు మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లి బీడీల మైసమ్మ ప్రజలను ఆయురారోగ్యాలతో కాపాడాలని ఆకాంక్షించారు. సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి మల్ల యోధులు కుస్తీలో పాల్గొన్నారు. కుస్తీలో నెగ్గిన మల్ల యోధులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నారు. జాతర సందర్భంగా నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ పోలీసులతో నిబంధన నిర్వహించారు. కార్యక్రమంలో ఈ గ్రామ ప్రముఖులు మాజీ వైస్ ప్రెసిడెంట్ మనోహర్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రమేష్ గౌడ్, మాజీ సర్పంచులు అంబవ్వ, సాయిలు, అంజయ్య పాల్గొన్నారు.

'ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తాం'

రెంజల్,మార్చి2(ఆంధ్రజ్యోతి): రైతులు అధైర్యపడకుండా పంట సాగు చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం రెంజల్ మండల కేంద్రంతో పాటు తాడ్‌బిలోలి, బోర్గాం, సాటాపూర్ గ్రామాలలో రైతులతో సాగునీటిపై చర్చించారు. రైతులు ఒకే రకమైన పంటలు వేయకుండా పంట మార్పిడి చేసుకున్నట్లయితే భూమి సారవంతమైన అధిక లాభాలు పొందుతారని అన్నారు. ప్రతిసారి ఒకే క్రాప్ వేయడం వల్ల భూమి సారాన్ని కోల్పోతుందని, పంట మార్పిడి చేయడం వల్ల భూమి సారాన్ని కోల్పోకుండా ఉంటుందని అన్నారు. వరిపంటతో పాటు ప్రత్యామ్నాయంగా చెరకు సాగు చేసినట్లయితే అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, బోధన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, సాయిరెడ్డి, సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్, నితిన్, రవి, సాయిబాబా గౌడ్, సాయాగౌడ్, రమేష్ కుమార్, కుర్మె శ్రీను, సగ్గు వెంకటి, అసాని అనిల్, ఖుద్దుస్, యోగేష్, అంజాగౌడ్, సురేష్, సిద్ద సాయిలు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాడాపూర్, జన్నేపల్లి, నవీపేట, ఫకీరాబాద్ గ్రామాలలో అలీసాగర్ కాలువల ద్వారా కొనసాగుతున్న సాగునీటి పంపిణీని ఆయన పరిశీలించారు. వానాకాలం సీజన్‌లో ఎంత మేర వరి సాగు జరిగిందో యాసంగిలో సైతం సుమారు అంతే మొత్తంలో వరిపంట సాగు కొనసాగుతుందని అన్నారు.

తాడ్వాయిలో దొంగల బీభత్సం

- ఒకే రోజు మూడిళ్లలో చోరీ
- పోలీసులకు సవాల్‌గా మారిన దొంగతనాలు
- పెట్రోలింగ్ చేయాలని గ్రామస్తుల వినతి


బీరువాలో చిందరవందరగా ఉన్న దుస్తులు

తాడ్వాయి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం రాత్రి ఒకే రోజు మూడిళ్లలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన బాయికాడి శరత్ ఇంట్లో నాలుగున్నర తులాల బంగారం, ఐదువేల నగదు, ఇరవై తులాల పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. అలాగే గడ్డమీది సావిత్రికి చెందిన మూడు మాసాల బంగారం రెండు మాసాల ఉంగరం, రూ.18 వేల తులాల నగదు, సురకంటి ప్రతాపరెడ్డికి చెందిన బైకు అలాగే బ్రాహ్మణ పల్లి గ్రామానికి చెందిన కురుమ తిరుపతికి ఇంట్లో మూడు లక్షల రూపాయల నగదును చోరీ చేశారు. ఒకేరోజు మండలంలో మూడిళ్లలో చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి ఒకరు, అత్త గారింటికి మరొకరు వెళ్లారు. ఇంకొకరు పక్కింట్లో నిద్రిస్తుండగా మూడు ఇళ్లలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గతంలో కూడా మండలంలో అనేక చోరీలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఒకే రోజు వరుస చోరీలు జరగడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి
- తిప్పాపూర్‌లో డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం


తిప్పాపూర్‌లో క్రీడాకారులతో అతిథులు, నిర్వాహకులు

భిక్కనూరు, మార్చి 02(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి నిర్వహించిన డివిజన్‌స్థాయి క్రికెట్ పోటీలను బద్దం ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయని, తిప్పాపూర్‌లో డివిజన్ స్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం భీంరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌స్థాయి ఈ పోటీలకు 40జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

లభించని గురుకుల విద్యార్థి ఆచూకీ?

నిజాంసాగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఓంకార్ ఆచూకీ లభించలేదు. మండలంలోని అచ్చంపేటలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మద్నూర్ మండలం పెద్ద శకర్గా గ్రామానికి చెందిన ఓంకార్ గత ఫిబ్రవరి 19న పాఠశాల లాప్టాప్‌ను దొంగలించినట్టుగా సీసీ కెమెరాల ద్వారా పాఠశాల అధ్యాపకుల పరిశీలనలో వెల్లడయింది. విద్యాభ్యాసం చేస్తున్న ఓంకార్‌ను పాఠశాల అధ్యాపకులు పిలిచి అడుగగా లాప్టాప్ దొంగలించింది తానేనని ఒప్పుకున్న విషయం తెలిసిందే. 22 ఫిబ్రవరి సాయంత్రం వరకు దొంగిలించిన లాప్టాప్‌ను అప్పగిస్తానని అధ్యాపకులకు పేర్కొన్నాడు. ఫిబ్రవరి 22వ తేదీన ల్యాప్టాప్ ఇవ్వకపోవడంతో పాఠశాల ప్రధానాచార్యులు నిజాంసాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో 10వ తరగతిలో విద్యాభ్యాసం చేస్తున్న ఓంకార్ కనిపించడం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజాంసాగర్ పోలీసులు రంగంలోని దిగి విచారణ చేపట్టారు. పిట్లం మండల కేంద్రంలో ఉన్న ఓ మొబైల్ షాప్ యజమానికి 4 వేలకే లాప్టాప్‌ను అమ్మగా పోలీసులు దానిని స్వాధీనం చేసుకొని గురుకులం అధ్యాపకులకు అప్పగించారు. ఓంకార్ ఆచూకీ కోసం పోలీసులు అధ్యాపకులు నిజామాబాద్, కామారెడ్డి, నారాయణఖేడ్ సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో గాలింపు చేపడుతున్నారు. కాని ఓంకార్ ఆచూకీ లభ్యం కావడం లేదు. ఓంకార్ మహారాష్ట్రలోని దగ్గరలో తన బంధువుల వద్ద ఉన్నట్లుగా సమాచారము వచ్చినప్పటికీ పూర్తివివరాలు తెలియడం లేదు.

దుర్గామాత ఆలయ వార్షికోత్సవం


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

నాగిరెడ్డిపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లారం గ్రామంలో దుర్గామాత ఆలయం ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గడ్డం ప్రభు నారాయణ్, శాంతాబాయి దంపతుల ఆధ్వర్యంలో ఈ ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామం నుంచి ఆలయం వరకు మహిళలు బోనాలను ఎత్తుకొని ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో అమ్మ వారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లారం మాజీ సర్పంచ్ వీణా ధనుంజయ్, నాయకులు ప్రభు గౌడ్ పాల్గొన్నారు.

మద్నూర్‌కు చేరుకున్న మహా పాదయాత్ర


పాదయాత్రలో భక్తులతో స్వామిజీ

మద్నూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని దేగ్లూరు నుంచి ప్రారంభించిన కళ్యాణ్ పాక్ రేణుక చార్య పాదయాత్ర ఆదివారం మద్నూర్‌కు చేరుకుంది. మద్నూర్ భక్తులకు సంఘయప్ప స్వామి స్వాగతం పలికి అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సనాతన హిందూ ధర్మం భారతదేశంలోని అనాధిగా చరిత్ర కలిగిన ప్రాచీన ధర్మమని నిర్వాహకులు అన్నారు. అన్ని కుల మతాల గురువు అయినటువంటి జగద్గురు రేణుకాచార్యులు కొలనుపాక పుణ్యక్షేత్రంలో కొలువై ఉండటంతో మహాయాత్ర భక్తులు ఈనెల 12న కొలనుపాక చేరుకుంటారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ మహా పాదయాత్ర దెగ్లూర్ మండల కేంద్రం నుంచి కర్ణాటక భక్తులతో కలిసి తెలంగాణలోకి వచ్చిన తరువాత వీరు గుడిమేట్ మహారాజ్ శ్రీశ్రీశ్రీ సద్గురు మహాదేవ స్వామిజీ ఆధ్వర్యంలో కొలనుపాక చేరుకుంటారని వెల్లడించారు. పదిరోజుల పాటు మహా పాదయాత్ర కొనసాగుతుందని స్వామిజీ వెల్లడిం చారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి


పెద్దమల్లారెడ్డిలో హనుమాన్ మాల వేసుకున్న భక్తులు

భిక్కనూరు, మార్చి 02 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి హనుమాన్ గురుస్వాములు సిద్దరామాగౌడ్, రామస్వామి, రాజాగౌడ్, నవీన్‌గౌడ్, స్వామి అన్నారు. ఆదివారం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో 18మంది హనుమాన్ మాల ధరించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి గురుస్వాములు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రామంలో హనుమాన్ మాల వేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

- దర్శన్ - చావా
- ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్
- ప్రియా 35 - శబ్దం

బాన్సువాడ

- మహేశ్వరి - లైలా
- వెంకటేశ్వర - చావా

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	120	150
వెన్‌కాబ్(కిలో)	110	140	180

